

దర్శన్‌కు వైద్య పరీక్షలు

బళ్లారి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి అనే వ్యక్తి హత్య కేసులో నిందితుడుగా బళ్లారి జైల్లో ఉన్న కన్నడ సినీ హీరో దర్శన్‌కు మంగళవారం రాత్రి విమ్స్ లో వైద్య పరీక్షలు నిర్వహించారు. దర్శన్ వెన్నెముక నొప్పితో బాధ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు విమ్స్‌లో స్కానింగ్ పరీక్షలు చేశారు. ఉదయం వేళ ఆ సుపత్రికి తీసుకెళ్లితే అభిమానులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని భావించిన పోలీసులు రాత్రి తీసుకెళ్లారు. ఇంతకు మునుపే వ్యాయామాలు చేయాలని వైద్యులు సూచించారు. గత కొంత కాలంగా నొప్పి మరింత ఎక్కువ కావడంతో ఆయనకు మంగళవారం రాత్రి పరీక్షలు చేశారు.



బాబుసాబ్‌పాళ్యలో కూలిన భవనం

వణికించిన వరుణుడు

- నగరాన్ని కుదిపేసిన వాన
- కూలిన భవనం..
- ముగ్గురి మృతి
- రాష్ట్రం అతలాకుతలం
- యలహంకలో రబ్బర్‌బోట్లతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- నెలమంగలలో కూలిన వంతెన



జలమయమైన వీధులు



కేంద్రీయ విహార్ వద్ద పరిస్థితి ఇదీ..

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక్కరాత్రిలో వర్షం నగరాన్ని కుదిపేసింది. సోమవారం రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుదాకా కురిసిన వర్షంతో నగరంలోని వందలాది లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల గోడలు కూలి నష్టం వాటిల్లింది. బాబుసాహెబ్‌పాళ్యలో నిర్మాణ దశంలో ఉన్న భవనం కూలి ముగ్గురు మృతి చెందారు. ఎడతెరిపిలేకుండా రాత్రంతా కురిసిన వర్షంతో నగరంలో ఎటు చూసినా నదులను తలపించాయి. బెంగళూరు నగర ప్రాంతంలో 15.7 సెంటి మీటర్ల వర్షం కురవగా.. బెంగళూరు గ్రామీణ జిల్లాలో 17.65 సెం.మీ. వర్షం పాతం నమోదైంది. భారీ వర్షానికి నగరంలో జనం ఎక్కడివారు అక్కడే ఉండే నిలిచిపోయారు. ప్రధానంగా హెబ్బాళ, సహకారనగర, కోగిలు క్రాస్, యలహంక, దేవనహళ్లి విమానాశ్రయ పరిధిలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. యలహంక పరిధిలోని కోగిలు క్రాస్ సమీపంలో ఉండే కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్ మరోసారి మునిగింది. ఇటీవల రెండు నెలల వ్యవధిలో అపార్ట్‌మెంట్ మునగడం ఇది మూడోసారి. అపార్ట్‌మెంట్ చుట్టూ నీరు చేరడంతో ఇళ్లలోని వారు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. మంగళవారం బీబీఎంపీ, అగ్నిమాపక శాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. రబ్బర్‌బోట్ల ద్వారా అపార్ట్‌మెంట్‌లోని వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యలహంక చెరువు మరవనీరు భారీగా రావడంతోనే అపార్ట్‌మెంట్‌లోకి నీరు చేరింది. ఇక్కడ 604 నివాసాలు ఉండగా 2500 మంది ప్రజలు ఉన్నారు. వారందరినీ 16 రబ్బర్‌బోట్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు. మరోవైపు టాటానగర్ పరిధిలో లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి నీరు చేరడంతో బీబీఎంపీ అధికారులు పంపులు ఏర్పాటు చేసి నీటిని తొలగించారు. టాటానగర్ కోసం రెండు రబ్బర్‌బోట్లను ప్రత్యేకంగా కేటాయించి ప్రజలను తరలించారు. సహకారనగర్‌లోని చిత్రకూట అపార్ట్‌మెంట్ ప్రహరీ గోడ కూలడంతో పక్కనే ఉన్న రాజకాలువలో ప్రవహిస్తున్న మురుగునీరు అపార్ట్‌మెంట్‌లోకి చేరింది. దీంతో మూడు క్రాస్ రోడ్లు జలావృతమయ్యాయి. అపార్ట్‌మెంట్ పక్కనే ఉండే కైసర్ రెసిడెన్సీలోకి నీరు చేరింది. నీటిని పంపుల ద్వారా తొలగించారు. నగర పరిధిలోని పుట్టేనహళ్లి చెరువు పక్కన ఉండే రమణశ్రీ కాలిఫోర్నియా గార్డెన్ అపార్ట్‌మెంట్‌లోని 25 ఇళ్లలోకి నీరు చేరింది. మహదేవపుర పరిధిలోని సాయిబాబా లే అవుట్, గద్దలహళ్లి తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన నీటిని పంపుల ద్వారా తొలగించారు. కోగిలు క్రాస్, యలహంక, టాటానగర్ ప్రాంతాల్లో రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్‌తోపాటు అధికారులు పర్యటించారు. ప్రతి ఇంటికి వాటర్‌బాటిల్, ఆహారం అందించారు. పదుల సంఖ్యలో అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దించారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో అత్యధికంగా వర్షం కురిసింది. మైసూరు, మండ్య, రామనగర, శివమొగ్గ జిల్లాల్లోనూ వర్షం పోటెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా వర్షం ప్రభావం కొనసాగింది. ఈనెల 1నుంచి 22 వరకు 241 మి.మీ. వర్షం కురిసింది. 124 ఏళ్లలో నాల్గవ అతిపెద్ద భారీవర్షంగా నమోదైంది. 1901 తర్వాత బెంగళూరులో కురిసిన అత్యంత భారీ వర్షాలలో ఇది కూడా ఉన్నట్టు వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. 1970, 2005 తర్వాత 2024లో భారీ వర్షం కురిసింది. నగరంలో రోడ్లను వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో తుమకూరులోని అమానికెరె నిండింది. మరవనీరు సజావుగా వెళ్లేందుకు కాలువలేకపోవడంతో పంటపొలాలు, ఇళ్లలోకి నీరు చేరింది. శిరాగేట్, 80 అడుగుల రోడ్డు పొడవునా నీరు నిలిచిపోయింది. పలు ఇళ్లలోకి నీరు చేరడంతో తుమకూరు నగర పాలక, వివిధశాఖల అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. లోతట్టు వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న బీబీఎంపీ కమిషనర్



కూలిన భవనం వద్ద సహాయక చర్యలు

బాబుసాహెబ్‌పాళ్యలో కూలిన భవనం

బెంగళూరులో నిరంతరంగా కురుస్తున్న వర్షాల ధాటికి తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హెణ్ణూరు పరిధిలోని బాబుసాహెబ్‌పాళ్యలో నిర్మాణ దశలో ఉన్న భవనం కూలింది. మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలవేళ 16 మంది కార్మికులు పనిచేస్తున్న సమయంలో భవనం కుప్పకూలింది. వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్‌తోపాటు అగ్నిమాపక శాఖ అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించారు. మూడు మృతదేహాలను వెలికితీశారు. మరో ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు. శిథిలాలకింద ఇరుక్కున్నవారిని రక్షించే కార్యాచరణ కొనసాగుతోంది.

నెలమంగల వద్ద కూలిన వంతెన

బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలోని నెలమంగల రోడ్డు చిక్కబిదరకల్లు గ్రామంలో జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న సర్వీస్‌రోడ్డు వంతెన కూలి పోయింది. సర్వీస్ రోడ్డు నుంచి బిదరకల్లు గ్రామపరిధిలో ఉండే రామాలయం వెళ్లేందుకు దీనిని నిర్మించారు. వంతెన అకస్మాత్తుగా కూలిపోవడంతో సర్వీస్‌రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆ మార్గాన్ని కొన్నిగంటలపాటు మూసివేశారు.

కొట్టుకుపోయిన వ్యక్తిని రక్షించిన స్థానికులు

దేవనహళ్లిలోని దొడ్డసాగర కాలువలో కొట్టుకుపోయిన వెంకటేశ్ అనే వ్యక్తిని స్థానికుల రక్షించారు. సోమవారం సాయంత్రం భవన నిర్మాణ పనులు ముగించుకుని వెళ్తుండగా కాలువలో పడిపోయాడు. అర కిలోమీటరు పాటు కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి రక్షించారు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.



ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం








కేంద్రీయ విహార్ వద్ద సహాయక చర్యలు చేపడుతున్న సహాయక బృందాలు

తుంగభద్ర..!

- తుంగభద్ర జలాశయానికి ఉధృతంగా వరద నీరు
- క్రస్ట్‌గేట్లు తెరిచి నదికి మళ్లింపు
- క్రస్ట్‌గేట్ల భద్రతపై ఆందోళన
- ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న అధికారులు



తుంగభద్ర క్రస్ట్‌గేట్ల నుంచి పరుగులు తీస్తున్న జలాలు

బళ్లారి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రైతులకు జీవధారగా ఉన్న తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలాశయానికి నీరు ఉధృతంగా చేరుతోంది. జలాశయం నిల్వ సామర్థ్యానికి మించి నీరు చేరుతుండడంతో క్రస్ట్‌గేట్లు తెరిచి నీటిని నదికి వదులుతున్నారు. రోజురోజుకూ నీటి ఉధృతి పెరుగుతుండడంతో డ్యాం అధికారులు ఆందోళన చెందుతున్నారు. క్రస్ట్‌గేట్లు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని నిరంతరం పరిశీలిస్తున్నారు. ఆగస్టు 10న డ్యాంలో నీటి ఉధృతికి 18వ క్రస్ట్‌గేటు కొట్టుకుపోయిన విషయం విదితమే. డ్యాంగేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, ఇతర అధికారులు రంగంలోకి దిగి స్టాప్ లాగ్ అమర్చారు. క్రస్ట్‌గేటు ప్రమాదంలో కొట్టుకుపోయిన నేపథ్యంలో తుంగభద్ర ప్రాంత రైతులు, అధికారులు ఆందోళన చెందారు. గత నెలరోజులుగా జలాశయానికి నీరు చేరుతూనే ఉంది. డ్యాం సామర్థ్యం 1633 అడుగులు కాగా, ప్రస్తుతం డ్యాం లెవెల్ 1631.92 అడుగులు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 101.461 టీఎంసీలు నీరు ఉంది. మంగళవారం సాయంత్రానికి జలాశయానికి ఇన్‌ఫ్లో 1,12,136 క్యూసెక్కులు ఉండగా.. క్రస్ట్‌గేట్లు తెరిచి నదికి 1,01,628 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. నది కింద భాగంలో ఉండే ప్రాంతాలను అప్రమత్తం చేశారు. తీరంలో ఉండే గ్రామాల ప్రజలు ఎవరూ నది వైపు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జలాశయానికి పై ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో భారీ స్థాయిలో వస్తుండడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకు ముందు క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. ఇంతకు ముందే నీటి ప్రాజెక్టుల గేట్ల తయారీ నిపుణులు మొత్తం 33 గేట్లు మార్చాలని సూచించారు. 70 ఏళ్ల క్రితం అమర్చిన గేట్లు కాలం చెల్లాయని హెచ్చరించారు. బోర్డు అధికారులు, బోర్డు కమిటీ కూడా గేట్ల మార్పుపై సీడబ్ల్యూసీకి నివేదిక ఇచ్చాయి. కానీ ఇంత వరకూ అనుమతి అందలేదు. ప్రస్తుతం డ్యాంలో నీరు నిండు కుండలా తొణికిసలాడుతోంది.

వరుణపై వరాల జల్లు

- తప్పు చేయలేదు
- బీజేపీ-జేడీఎస్ కుట్రలకు భయపడను
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వరుణ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య వరాలజల్లు కురిపించారు. వరుణ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.501.8 కోట్ల పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ వరుణ ప్రజల ఆశీర్వాదంతో రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యానని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా నియోజకవర్గ అభివృద్ధి పనులపై స్థానికులు అడుగుతున్నారని, వాటన్నింటికీ పరిష్కారం చేసేలా నిధులు కేటాయించానని తెలిపారు. సిద్దరామయ్య ఒక్క రూపాయి లంచం తీసుకున్న రుజువు ఉందా..? అని ప్రశ్నించారు. తనపై వచ్చిన తప్పుడు ఆరోపణలను సహిస్తారా..? అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు బీజేపీ, జేడీఎస్ కుట్రలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. వరుణ కాంగ్రెస్‌కు కంచుకోటలాంటిదని, లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని తెలిపారు. వరుణ అభివృద్ధి కోసం నిరంతరంగా గ్రాంట్లు కేటాయిస్తున్నా అన్నారు. తాను ఉపకారం చేయడం లేదని, నియోజకవర్గ ప్రతినిధిగా బాధ్యతతో పని చేస్తున్నా అన్నారు. తమ కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్న ప్రతిసారి వరుణ నియోజకవర్గానికే కాకుండా రాష్ట్రంలోని పేదలందరికీ ఆర్థికశక్తిని నింపే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. భాగ్యలు, గ్యారెంటీల పేరిట ప్రతి పేదవాడికి అండగా నిలిచామన్నారు. సామాజిక న్యాయానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. మూడుసార్లు ప్రధాని అయిన నరేంద్రమోదీ ప్రజలకు మేలు చేసిన దాఖలాలు ఉన్నాయా..? అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిరంతరంగా అన్యాయం జరుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్యారెంటీలు నిలిచిపోతాయని ప్రచారం చేశారని, ఏ గ్యారెంటీ అయినా ఆగిందా.. అని ప్రశ్నించారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టి 45 ఏళ్లు అయ్యిందని, తనపై అవినీతి మరకలేదని, బీసీ వర్గానికి చెందిన తాను రెండుసార్లు సీఎం అయ్యానని అదే బీజేపీకి కడుపు మంట అన్నారు. రెండుసార్లు సీఎంగా ఉన్నా మైసూరులో సొంత ఇల్లులేదని అన్నారు. కువెంపు రోడ్డులో మూడేళ్లుగా ఇల్లు కడుతూనే ఉన్నానని, ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప, మంత్రులు వెంకటేశ్, రహీంఖాన్, బోసరాజు, గ్యారెంటీ అమలు కమిటీ ఉపాధ్యక్షురాలు పుష్ప అమరనాథ్, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య, రవిశంకర్, దర్శన్ ధ్రువనారాయణ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

నేడు పాఠశాలలకు సెలవు

బెంగళూరు వ్యాప్తంగా నిరంతరంగా కురిసిన వర్షాలధాటికి బుధవారం అంగన్‌వాడీ, పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు బెంగళూరు నగర జిల్లా అధికారి జగదీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, హైస్కూళ్లకు సెలవు కొనసాగుతుందని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలన్నింటికీ సెలవు వర్తిస్తుందన్నారు. కళాశాలలకు సెలవు ప్రకటించలేదు.

మైసూరులో సోనియా, ప్రియాంక

- స్వాగతించిన సీఎం, డీసీఎం

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ప్రియాంకగాంధీలను మైసూరు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సాదరంగా స్వాగతించారు. కేరళలోని వయనాడ్‌లో ప్రియాంకగాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఢిల్లీనుంచి ప్రత్యేక విమానాంలో సోనియా, ప్రియాంక మైసూరు విమానాశ్రయానికి మంగళవారం చేరుకున్నారు. సీఎం, డీసీఎంతో పాటు మంత్రులు మహదేవప్ప, వెంకటేశ్ తదితరులు ప్రియాంకగాంధీకి కండువాలు అందించి స్వాగతించారు. ప్రియాంకగాంధీ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య పాల్గొననున్నారు. బుధవారం బెంగళూరు నుంచి కణ్ణూరు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా వయనాడ్‌కు చేరుకుంటారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు పాల్గొంటారు.



సోనియా, ప్రియాంక గాంధీతో మాట్లాడుతున్న సీఎం, డీసీఎం

చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారులోని కెంగేరి చెరువులో పడి ఇద్దరు పిల్లలు మృతి చెందారు. సోమవారం సాయంత్రం శ్రీనివాస్ (15), చెల్లెలు మహాలక్ష్మి (13) బట్టలు ఉతికేందుకు చెరువు దగ్గరకు వెళ్లారు. కాలుజారి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారు. చిన్నారుల తల్లి బెంగళూరు పాలికెలో పౌరకార్మికులిగా పనిచేస్తున్నారు. ఇటీవల కెంగేరి సమీపంలోని హర్ష లే అవుట్‌కు వచ్చి నివసిస్తున్నారు. తల్లి పనులకు బయటకు వెళ్లిన సమయంలో అన్నాచెల్లెలు చెరువు వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లారు. తల్లి ఇంటికి రాగా పిల్లలు కనిపించకపోవడంతో వెతికారు. చెరువు గట్టు వద్ద బట్టలు, పాత్రలు ఉండడంతో చెరువులో పడి ఉంటారని భావించారు. కెంగేరి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రాత్రి పొద్దుపోయాక కార్యాచరణ జరిపారు. మంగళవారం మరోసారి గాలించగా ఉదయం శ్రీనివాస్ మృతదేహాన్ని, సాయంత్రం మహాలక్ష్మి మృతదేహాన్ని చెరువునుంచి వెలికితీశారు. చిన్నారుల తల్లిదండ్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇన్‌సెట్‌లో మృతిచెందిన చిన్నారులు



రాప్తాడు మండలంలో నీట మునిగిన వరి పైరు





టీవీ టవర్ ఆటోనగర్ వద్ద ఇళ్లు నీట మునగడంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు



ఉప్పరపల్లి జగనన్నకాలనీలో ఓ కొట్టంపై సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితుడు



నీట మునిగిన ఉప్పరపల్లి జగనన్న కాలనీ

జిల్లాలో భారీ వర్షం

అతలాకుతలం

తెగిన కనగానపల్లి చెరువు
నీట మునిగిన పంటలు, ఇళ్లు
భారీగా పంట, ఆస్తి నష్టం
పరిశీలించిన అధికారులు

అనంతపురంరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కుంభవృష్టి కురిసింది. రాప్తాడు మండలంలోని బండమీదపల్లి చెరువు నిండి పొంగి పొర్లడం, కనగానపల్లి చెరువుకు గండిపడటంతో పండమేరు వంక ఉగ్రరూపం దాల్చింది. దీంతో రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఉప్పరపల్లిలోని జగనన్న కాలనీ, గురుదాస్ కాలనీ, ఆటోనగర్ కాలనీలు నీటమునిగిపోయాయి. జగనన్న కాలనీలో దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తువరకు నీరు వచ్చిచేరాయి. నగరశివారు అటవీ శాఖ వనమిత్ర వెనుకభాగంలో గుడిసెలన్నీ నీట మునిగి కొట్టుకుపోయాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు మునిగిపోయాయి. కొన్ని వాహనాలు కొట్టుకుపోయాయి. ఆయా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి, ధాన్యం గింజలు, దుస్తులు ఇతరత్రవన్నీ నీటిలో మునిగిపోయాయి.

అప్రమత్తమైన అధికారులు..

ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీలు నీటి మునిగిన విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు తమ సిబ్బందితో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. నీటమునిగిన ప్రాంతాల్లో ఉండిపోయిన ప్రజలను స్థానికుల సాయంతో జేసీబీలతో బయటకు తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస ప్రదేశాలకు తరలించారు. గ్రామంలోని వీరనాగమ్మ గుడి, ప్రభుత్వ పాఠశాల, ఆర్డీటీ స్టేడియం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో భోజనం ఇతరత్ర సౌకర్యాలు కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమేరకు మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని కాలనీల్లో ఆయన పర్యటించారు. పరిస్థితిని అధికారులతో సమీక్షించి, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

దెబ్బతిన్న పంటలు..

భారీగా కురిసిన వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ఉప్పరపల్లితో పాటు సోములదొడ్డి, పాములరాయి, కందుకూరు, మన్నీల, చియ్యేడు, ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో ఎక్కువశాతం వరి పంట నెల కొరిగింది. మన్నీల, చియ్యేడు, కందుకూరులో వేరుశనగ పంట నీటమునిగింది. మండల వ్యాప్తంగా వరి 22హెక్టార్లు, వేరుశనగ 15హెక్టార్లలో దెబ్బతినట్లు ఏఓ శశికళ తెలిపారు.

నీట మునిగిన జగనన్న కాలనీ





ఎక్స్‌కవేటర్‌లో ఒడ్డుకు ముంపు బాధితులు



వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ, పరిటాల శ్రీరామ్

నిండు కుండలా బండమీదపల్లి చెరువు



100 ఎకరాలకు పైగా నష్టం

రాప్తాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు, కాలువలు మరువ పారుతున్నాయి. బండమీదపల్లి చెరువు నిండి మరువ పారుతోంది. నీరు అధికం కావడంతో మరువ వద్ద కట్ట కోతకు గురైంది. దీంతో మరువ నీరు పంట పొలాలపై ప్రవహించాయి. చీనీ చెట్లు, వరి పొలాలపై నీరు ప్రవహించడంతో వరి పొలాలు నీట మునిగాయి. వంద ఎకరాలకు పైగా నష్టం వాటిల్లింది.

- బండమీదపల్లి గ్రామంలో నల్లాపురమ్మ ఆలయ పూజారి నారాయణప్పకు చెందిన 80 మేకలు నీటిలో మునిగి మృతి చెందాయి. కొన్ని మేకలు గల్లంతయ్యాయి.



రాప్తాడు మండలంలో వాన నీటితో నిండిపోయిన చీనీ తోట



బండ్లపల్లిలో మృతి చెందిన మేకలు

రికార్డుస్థాయిలో వర్షం



తెగిన కనగానపల్లి చెరువుకట్ట



కుర్లపల్లిలో వరదనీటికి కొట్టుకుపోయిన వేరుశనగ

కనగానపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో 19 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. మండలంలోని ముత్తవకుంట్ల, ముక్తాపురం, తగరకుంట, తల్లిమడుగుల తదితర చెరువులన్నీ మరువ పారాయి. కనగానపల్లి చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో నీరంతా పంట పొలాల మీదుగా ప్రవహించింది. మండల వ్యాప్తంగా 200 ఎకరాల్లో వరి, 200 ఎకరాలలో వేరుశనగ, వంద ఎకరాల్లో టమోట, 300 ఎకరాల్లో ఇతర పంటలు భారీగా దెబ్బతిన్నాయి. తగరకుంటలో 5 ఇళ్లు, కనగానపల్లిలో 18 ఇళ్లు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. మామిళ్లపల్లి తలిపిరి వద్ద అచ్చంపల్లికి చెందిన టమోటా లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం వరదలో కొట్టుకుపోయింది. అందులో ఉన్న దాదాపు 250 టమోటా బాక్స్‌లు నీటమునిగాయి. కనగానపల్లిలో చెరువుతెగిపోయిందన్న సమాచారంతో ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ రమాదేవి ఇతర అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే చెరువుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.

స్తంభించిన రాకపోకలు

కాగా ముక్తాపురం చెరువు మరువ పారి జాతీయ రహదారిపైకి నీరు రావడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరువైపులా 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మామిళ్లపల్లి పెద్దవంక పారడం, కనగానపల్లి పండమేరు వంక పొంగిపొర్లడంతో కనగానపల్లి, ధర్మవరం మధ్య ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

వైసీపీ వల్లే ఈ దుస్థితి: పరిటాల సునీత

కనగానపల్లి చెరువు తెగిందన్న సమాచారంతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అక్కడకు చేరుకున్నారు. అక్కడ తెగిన కట్టను, పంట నష్టాన్ని పరిశీలించారు. వెంటనే ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడుకు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువుల మరమతులు, కాలువ పనులు చేపట్టకపోవడంతోనే ఇప్పుడు ఇంతటి నష్టం జరిగిందని విమర్శించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత

మరువ పారిన చెరువులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. వరి, టమోట, వేరుశనగ, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. హరియన్ చెరువులో 60 ఎకరాలకు పైగా వరి నీట మునిగింది. ముష్టికోవెల, న్యామద్దల, హరియన్‌చెరువు చెరువులు మరువ పారడంతో ఈ పరిస్థితి సంభవించిందని రైతులు పేర్కొన్నారు. చిత్రావతి, వంగపేరు నది ఉధృతి కారణంగా ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. నీకేపల్లి, నామాల, న్యామద్దల, హరియన్‌చెరువు తదితర గ్రామాలలో వంకలు భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



చిన్నమొగలాయపల్లిలో నీటమునిగిన టమోటా



కొట్టుకుపోయిన పోలేపల్లి-అక్కంపల్లి రోడ్డు

పంటలకు అపార నష్టం

రామగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 98.5మి.మీ వర్షపాతం కురిసింది. ఈ వర్షానికి పోలేపల్లి, అక్కంపల్లి, కుంటిమద్ది, శ్రీహరిపురం, నుద్దకుంటపల్లి తదితర గ్రామాలలో వరి, వేరుశనగ, టమోట, ఆముదం పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆయా గ్రామాలకు వెళ్లి నష్టపోయిన వారికి ధైర్యం చెప్పారు. కుంటిమద్ది చెరువు నుంచి భారీగా వరద ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 60 ఎకరాలలో పంట నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. అక్కంపల్లి, పోలేపల్లి గ్రామాలకు చెందిన నారాయణ, జనార్దన్ నాయుడు, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తికి చెందిన దాదాపు 250 బస్తాలు వేరుశనగకాయలు వర్షానికి కొట్టుకుపోయాయి.



నీటిపాలైన వేరుశనగ

మరో మూడు రోజులు వానలు



బుక్కరాయసముద్రం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయం, ఉద్యాన పంటలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటలను ఆశించిన చీడ పురుగుల నివారణకు పురుగుమందులు పిచికారీ చేయడాన్ని మూడు రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు.


రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు సూచించారు. ఉద్యాన, వ్యవసాయ పంటలకు సంబంధించి తక్షణమే వ్యవసాయ సలహాలు పాటించాలని సూచించారు. అధిక వర్షాలు వలన ముంపునకు గురి అయిన తోటల్లో మురుగు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. కోత కోసిన పంటను భద్ర పరుచుకోవాలని సూచించారు. అరటి, టమాటా పంటలు గాలి, వానకు పడిపోకుండా ఊతం ఇవ్వాలన్నారు. కూరగాయల పంటలకు వర్షాలు నిలిచిన అనంతరం ఫార్ములా- 4 లేదా పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పూత దశలో ఉన్న కందిలో మచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం శనగ సాగు చేసే రైతులు అక్టోబరు రెండో పక్షం నుంచి నవంబరు మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చని సూచించారు.

హంద్రీనీవా కాలువకు గండి

హంద్రీనీవా కాలువకు పడిన గండి



సోమందేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచేపల్లి సమీపాన మంగళవారం హంద్రీనీవా కాలువకు గండిపడింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లడంతో హంద్రీనీవా కాలువలోకి పెద్దఎత్తున నీరు చేరింది. మంచేపల్లివద్ద కాలువకు గండిపడింది. నీరు మంచేపల్లి, పందిపర్తి చెరువులకు చేరుతోంది. గ్రామస్థులు.. అధికారులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే రెండు చెరువులు నిండి మరువలు పారడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. మంచేపల్లి చెరువు మరువ నీరు ఈదులబళ్లాపురం చెరువుకు చేరుతున్నాయి. సమాచారం అందుకున్న అధికారులు ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువ గండిని పూడ్చే క్రమంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై సమీక్షించారు. గ్రామంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు.

సీబీఆర్‌కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నేడు గేట్లు ఎత్తే అవకాశం

తాడిమర్రి మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం ఉదయానికి ఇన్‌ఫ్లో 5వేలు ఉండగా.. సాయంత్రానికి అది 10వేలకు పెరిగినట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం మొత్తం 9.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.7 టీఎంసీల నిల్వఉంది. ఇన్‌ఫ్లో బుధవారం వరకు కొనసాగితే 10 గంటలకు రెండు గేట్లు ఎత్తి, నీటిని నదికి వదులుతామని అధికారులు తెలిపారు. దాడితోట, తురకవారిపల్లి, నాయనపల్లి, యల్లనూరు మండలం లక్షుంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నదిలోకి ఎవరూ దిగరాదని ఈఈ సూచించారు.

మర్తాడులో వర్షానికి నేలవాలిన వరిపంట



122 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

గార్లదిన్నె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి 30 మి.మీటర్ల వర్షం కురిసింది. దీంతో వరి, పత్తి, వేరుశనగ తదితర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. మొత్తం 47 మంది రైతులకు చెందిన 159 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అధికంగా వరి పంట దెబ్బతింది. 122 ఎకరాలలో వరి, 11 ఎకరాలలో వేరుశనగ, 22 ఎకరాలలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఉదయం వ్యవసాయ అధికారి సోమశేఖర్, సిబ్బంది పంటలను పరిశీలించారు.

సంక్షిప్తం

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.33, కనిష్ఠ ధర రూ.23 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వాయర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంగళవారం 1295 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1165 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటినిల్వ ఉందన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్‌లో నవంబరు 14నుంచి, జర్దోసి మగ్గం వర్క్‌లో 15నుంచి, టైలరింగ్‌లో 18వతేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగిన 19-45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, అనంతరం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 8309915577, 9618876060, 9440905479ను సంప్రదించాలని ఆమె కోరారు.

'దరఖాస్తు చేసుకోండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నవంబరు 24న నిర్వహిస్తున్న ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఆయన మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 480 మార్కులు, ప్రైవేట్ పాఠశాలలో 520 సాధించి ఉండాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన వారు 850, ప్రైవేట్ కళాశాలలో 900 మార్కులు సాధించిన జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులు అర్హులన్నారు. నవంబరు 15లోగా దరఖాస్తులను 'శ్రీనివాసులు, డోర్ నంబరు 18-1-406, వేణుగోపాల్‌నగర్, పాతూరు, అనంతపురం' చిరునామాకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9440501463, 9441222874కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు శివప్రసాద్ పాల్గొన్నారు.

డ్రస్‌మేకింగ్ కోర్సుకు అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల ఐటీఐలో డ్రస్‌మేకింగ్ కోర్సుకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఐటీఐల జిల్లా కోఆర్డినేటర్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఫెయిల్/పాస్ అయిన బాలికలు అర్హులన్నారు. ఈనెల 26 లోగా ఏపీ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న బాలికలు ఈ నెల 28న వారి సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

నేడు ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం రాక

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్కిల్ ఇన్‌చార్జ్ సీసీఎఫ్ సెల్వం బుధవారం రానున్నారు. ప్రస్తుతం ఉన్న సీసీఎఫ్ యశోదాబాయి బాధ్యతలు చేపట్టిన వెంటనే శిక్షణ నిమిత్తం వెళ్లారు. దీంతో తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ సెల్వం కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన బుధవారం రానున్నారు. ఆయన గురువారం ఎన్ఆర్‌జీఎస్ స్కీమ్ అమలుపై అనంతపురం సర్కిల్ సిబ్బందితో వర్క్‌షాప్ ఏర్పాటు చేసి చర్చించనున్నారు.

రెండు రైళ్ల రద్దు

గుంతకల్లు, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): దానా తుపాను కారణంగా అనంతపురం మీదుగా వేళ్లే బెంగళూరు-హౌరా-బెంగళూరు అప్ అండ్ డౌన్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-భువనేశ్వర్ (రైలు నం. 18464)ను ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 18463)ను 24న రద్దు పరచినట్లు తెలియజేశారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

జిల్లాలోని రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి ప్యాసింజరును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును నవంబరు 1 నుంచి 30 వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590)ను నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో పాక్షికంగా రద్దు పరచి, గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు. అలాగే రైల్వే మెయింటెనెన్స్ పర్కుల కారణంగా గుత్తి మీదుగా వెళ్లే కాచిగూడ-తిరుపతి (నం. 07063) ప్రత్యేక రైలును ఈ నెల 29, నవంబరు 5, 12 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07064)ను ఈ నెల 30న, నవంబరు 6, 13 తేదీల్లోనూ రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఊరిబడికి ప్రాణం..!

జీఓ 117 రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

సర్వత్రా హర్షం



వృథాగా ఉన్న తరగతి గదులు

కదిరి మండలంలోని పట్నం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 170 మంది విద్యార్థులు గతంలో చదువుకునేవారు. గత వైసీపీ పాలనలో పాఠశాలల విలీనం తరువాత 1, 2 తరగతులకు చెందిన 19 మంది మాత్రమే మిగిలారు. వీరికి ఒక ఉపాధ్యాయుడున్నారు. పాఠశాలలో 16 గదులు ఉండగా, కొన్ని వృథాగా మారాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీఓతో ఈదుస్థితి ఏర్పడింది.



పట్నం ప్రాథమిక పాఠశాల

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117ను వచ్చే విద్యాసంవత్సరం నుంచి రద్దు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలో తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక ఉపాధ్యాయుడు లాంటి వాటిని అమలు చేస్తూ ఈ జీఓను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దాని అమలులో భాగంగా మార్పులు చేపట్టింది. పాఠశాలలను విలీనం చేయడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైంది. ప్రస్తుతం కొలువుదీరిన కూటమి ప్రభుత్వం వివాదాస్పద జీఓ రద్దుకు నిర్ణయించింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వేలల్లో తగ్గిన విద్యార్థులు

విలీన ప్రక్రియతో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు మందగించడం చాలాచోట్ల 1, 2 తరగతులు మాత్రమే నిలిచాయి. 3, 4, 5 తరగతులు విలీనమైనచోట్ల సరిపడా గదులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దూరంగా ఉండే పాఠశాలలకు పంపించడం ఇష్టంలేని తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. విలీన ప్రక్రియతో విద్యావ్యవస్థ నాశనం కావడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. అయినా గత వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. గత ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఎక్కువగా జీఓ 117కు సంబంధించిన వినతులే అందాయి. ఈనేపథ్యంలో ప్రాథమిక విద్యను దెబ్బతీసే జీఓ 117ను రద్దు చేస్తూ, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గాడితప్పిన వ్యవస్థను సరైన మార్గంలోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు జీవం

ప్రభుత్వ బడులకు ప్రతిబంధకంగా ఉన్న జీఓ 117ను రద్దు చేయడంద్వారా కూటమి ప్రభుత్వం పాఠశాలకు జీవం పోసింది. విలీన సమస్యలు నాలుగేళ్లుగా ఉపాధ్యాయులను వెంటాడుతున్నాయి. జీఓ రద్దుతో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతమవుతుంది. హామీ అమలు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- చింతా నాగరాజు, ఉపాధ్యాయుడు, కదిరి



విలీనంతో గందరగోళం

ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసేందుకు అమలు చేసిన 117 జీఓతో గందరగోళం ఏర్పడింది. ఫలితంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. జీఓను రద్దు చేస్తే బడులకు పూర్వవైభవం వస్తుంది.

- క్రిష్ణమోహన్, ఉపాధ్యాయుడు, కదిరి

నిరీక్షణకు తెర

పీఆర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండ

58 మందికి జీతాల భద్రత

పీఆర్ నుంచి డ్వామాకు బదలాయింపు

18 నెలల వేతన బకాయిలు మంజూరు



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిరీక్షణ ఫలించింది. వేతన బకాయిలు విడుదలయ్యాయి. దీంతో పంచాయతీ రాజ్ శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గత 16 ఏళ్ల నుంచి నెల నెలా సక్రమంగా జీతాలు రాక, ఇబ్బంది పడిన వారికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. జీతాల సమస్య పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీసుకెళ్లారు. వెంటనే డిప్యూటీ సీఎం స్పందించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఫలితంగా పీఆర్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ గ్రామీణాభివృద్ధి శాఖలోని డ్వామాలోకి బదలాయించారు. దీంతో పాటు అక్కడి నుంచే ప్రతి నెలా జీతాలు ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక 18 నెలల వేతన బకాయిలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.25 కోట్లను మంజూరు చేశారు. దీంతో ఇకమీదట ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వస్తాయని ఆ చిరుద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

ధ్రువపత్రాల పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఏమాత్రం ఆలస్యంగా కాకుండా డ్వామా, పీఆర్ అధికారులు కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం అభ్యర్థుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 02 ఆఫీస్ సబార్డినేట్‌లు, 34మంది టెక్నికల్ అసిస్టెంట్‌లు మొత్తంగా 58 మందికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతపురం జిల్లాలో 42మంది ఉద్యోగులకు స్థానిక డ్వామా సమావేశ మందిరంలో ధ్రువపత్రాల పరిశీలన చేశారు. డ్వామా హెచ్ఆర్ మేనేజర్ గీతా, సూపరింటెండెంట్‌లు శశికళ, శైలజ, పీఆర్ డీఈఈ గురుమూర్తిరాజు, డీఏఓ లక్ష్మీదేవి తదితర అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. డ్వామా పరిధిలోని ఎన్ఐసీ పోర్టల్ ద్వారా సమగ్ర వివరాలను అప్‌లోడ్ చేసి ఆప్కాస్ కిందికి వీరందర్నీ తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు ఒక్కొక్కర్ని కేటాయించారు. మొత్తంగా పీఆర్ నుంచి డ్వామాకు బదలాయించడంతో జీతాలకు భద్రత కలిగింది.



చుక్కలు చూపిన వైసీపీ సర్కార్

2009 నుంచి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 598మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నాం. మొదట్లో మాకు జీతాలు బాగానే ఇచ్చేవారు. అయితే ప్రభుత్వాలు మారినప్పుడల్లా మాకు కష్టాలే. గత వైసీపీ సర్కార్ ఐదేళ్ల పాలనలో మాకు చుక్కలు చూపించారు. ఉద్యోగ భద్రత పక్కన పెడితే కనీసం జీతాలను కూడా ఇవ్వలేదు. గత సీఎంతో పాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ఆర్టీలు అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి మా సమస్యను విన్నవించాం. వెంటనే పరిష్కారించి మాకు అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉంది.

- నరేష్‌బాబు (డేటాఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



డిప్యూటీ సీఎంకి రుణపడి ఉంటాం

మా సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి తిరిగినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వాలు మారినా మాకు న్యాయం జరగలేదు. కూటమి అధికారంలోకి రాగానే.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నెలల వ్యవధిలోని మా సమస్యను పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం.

- కిరణ్ (టెక్నికల్ అసిస్టెంట్, జోనల్ సెక్రటరీ)



ఉద్యోగులకు అండగా నిలిచినట్లే

పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. ఉద్యోగ భద్రతతో పాటు 18 నెలల వేతన బకాయిలు మంజూరు చేయడం చూస్తే.. వారందరికి ప్రభుత్వం అండగా నిలిచినట్లుగా అనిపిస్తోంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, ఉమ్మడి జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖ.

హామీని నెలబెట్టుకోండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శ రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని మంత్రి కేశవ్, ఇరిగేషన్ అధికారులకు సూచించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. డిస్ట్రిబ్యూటరీలతో పాటు ప్రధాన కాలువపైన దృష్టి సారించాలని కోరారు. కాలువలో పదివేల క్యూసెక్కుల నీరు పారించగలిగితే 3.5లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి జిల్లాను సస్యశామలం చేయవచ్చునన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2021లో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి, 6300క్యూసెక్కుల నీటిని తీసుకువస్తామని జీవో ఇచ్చినా ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ చేయకపోవడం వల్ల డ్యాంలో నీళ్లు ఉన్నప్పటికీ కూడా అదనంగా నీరు తీసుకోలేకపోతున్నామన్నారు. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు, కుంటలు తెగిపోయాయని, వాటి మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూధన్, రంగారెడ్డి, శీనప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణ.. అనంతరం మృతి



మల్లికార్జున (ఫైల్)

బుక్కరాయసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగదు లావాదేవీ విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మల్లికార్జున(45) మృతి చెందాడు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు... కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జునకు గోవిందపల్లి గ్రామ పంచాయతీలోని బీజేపీ కాలనీకి చెందిన రఫీ రూ.40వేలు అప్పు ఇచ్చాడు. ఈ డబ్బు విషయంగా ఇద్దరి మధ్య మంగళవారం వాగ్వాదం జరిగింది. దీనిపై పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. పంచాయితీ జరుగుతుండగానే మల్లికార్జున, రఫీ కొట్టుకున్నారు. వారి గొడవను పెద్ద మనుషులు ఆపారు. అనంతరం మల్లికార్జున కుప్పకూలిపోయాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. గొడవలో రఫీ కొట్టిన దెబ్బలకు మృతి చెందడా? లేదా అనారోగ్యం రీత్య మృతి చెందడా? అన్న విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరణాకర్ అనంతపురం సర్వజన అస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పెద్దమనుషుల పంచాయితీ, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

శివరాంపేట సమీపంలో..



మృతి చెందిన అశోక్, వినోద్

కూడేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్ (21), నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, మహిమలురూ గ్రామానికి చెందిన వినోద్ (27) మృతి చెందిన వారిలో ఉన్నారు. కూడేరుకు చెందిన దామోదర్ తీవ్రంగా గాయపడ్డారు. దామోదర్, వినోద్ ఇద్దరు మండల సమీపంలోని సుజలాన్ కంపెనీలో పనిచేస్తున్నారు. అశోక్ అనంతపురంలో వుడ్ వర్క్ చేసేవాడు. ప్రతి రోజు దామోదర్, వినోద్‌లిద్దరు కంపెనీలో పని ముగించుకొని కూడేరుకు వచ్చేవారు. అశోక్ కూడా అనంతపురంలో పని ముగించుకొని కూడేరు మీదుగానే స్వగ్రామానికి వెళ్లేవాడు. ఈక్రమంలో ముగ్గురు మంచి స్నేహితులయ్యారు. సోమవారం ద్విచక్ర వాహనంపై ముగ్గురూ కూడేరు నుంచి ఉరవకొండకు బయల్దేరారు. శివరాంపేట గ్రామం దాటిన తర్వాత మలుపువద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి, కింద పడ్డారు. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అశోక్, వినోద్ మృతి చెందారు. దామోదర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాలను పోస్టుమార్టంకు తరలించారు.

ఎంత ఘోరం చేశావు దేవుడా...

నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన వినోద్ కూడేరులో అద్దె గదిలో ఉంటూ సమీపంలో సుజలాన్ కంపెనీలో పని చేసేవాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి తల్లి పావని గుండెలవిసేలా మృతదేహంపై పడి రోదించింది. ఎంత ఘోరం చేశావు దేవుడా..! కుటుంబ జీవనానికి ఆధారంగా ఉంటున్న బిడ్డను మాకు దూరం చేశావా? ఇప్పటికే భర్తను తీసుకెళ్లావు. ఇప్పుడు కొడుకుని కూడా దూరం చేశావు ఇంక మాకు దిక్కెవరు అంటూ కన్నీరు మున్నీరు అయ్యింది. ఆమెను ఓదార్చడం బంధువులకు సాధ్యం కాలేదు.

ఢిల్లీలో అవార్డు అందుకున్నారు



అవార్డు అందుకుంటున్న వాటర్‌షెడ్స్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం సర్పంచు లక్ష్మీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జలసంరక్షణలో ఉత్తమ ఫలితాలు సాధించిన హంపాపురం గ్రామ పంచాయతీ వాటర్‌షెడ్ జాతీయ స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేంద్రజలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా డ్వామా వాటర్ షెడ్స్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, హంపాపురం గ్రామ పంచాయతీ సర్పంచు లక్ష్మీదేవి అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల డ్వామా, వాటర్‌షెడ్స్ ఉద్యోగులు, హంపాపురం గ్రామ పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు.

ఊరికి దారేది..!

నేటికీ రోడ్డులేని చాపర్లపల్లి బీసీ కాలనీ

మురుగు కాలువపై నుంచి వెళ్లాల్సిందే..



రోడ్డులేక డ్రైనేజీ గుండా వెళ్తున్న కాలనీ వాసులు

మడకశిర రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ యుగంలోనూ ఓ ఊరికి దారి లేదంటే నమ్మగలమా. అయినా వాస్తవం. మండలంలోని చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డులేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 90 ఇళ్లు, 290 మంది జనాభా ఉంటోంది. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లడానికి దారిలేదు. డ్రైనేజీ నుంచే వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రిపూట ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే వారు పడే బాధలు అన్నీఇన్నీ కావు. మారుమూల గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవనడానికి చాపర్లపల్లి బీసీ కాలనీయే నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు



శ్రీనివాసులురెడ్డి, చాపర్లపల్లి గ్రామం

గత ఐదేళ్లలో కాలనీకి రోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు వేయించాలి.

రాత్రిపూట బయటకు రావాలంటే భయం



నరసింహారెడ్డి, చాపర్లపల్లి

గ్రామ జనాభాలో సగానికిపైగా బీసీ కాలనీలో ఉంటున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి డ్రైనేజీలోనే వస్తున్నాం. రాత్రిపూట బయటకు రావాలంటేనే భయంగా ఉంది. డ్రైనేజీలో పాములు, విషపురుగులు ఉండడంతో సాయంత్రం ఐదు గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నాం. దారి లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

కాలనీ అభివృద్ధికి చర్యలు చేపడతాం

సోనియాబాయి, ఎంపీడీఓ, మడకశిర

చాపర్లపల్లి బీసీ కాలనీకి రోడ్డు విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతాం.



కొట్టుకుపోగా మిగిలిన వరి పంటను చూసి, ఆవేదన చెందుతున్న రైతు తరిగోపుల బాబు

కన్నీళ్లే మిగిలాయి...

కళకళలాడిన పైరు..
కనిపించకుండా పోయింది..
పరుచుకున్న పసిరిక
పత్తాలేకుండా పోయింది..
కష్టం నీళ్లపాలైంది..
కన్నీళ్లు మిగిల్చింది..
ఆశల పంట..
ఒక్కరాత్రిలో కొట్టుకుపోయింది..
బంగారు పంటలు పండే పొలం..
బండరాళ్లతో నిండిపోయింది..
అన్నదాత గుండె పగిలిపోయింది..



తరిగోపుల బాబు, రైతు

ఈయన పేరు తరిగోపుల బాబు. కనగానపల్లికి చెందిన రైతు. రాళ్ల మధ్యలో తన ఆశలను, కష్టాన్ని వెతుకుంటున్నాడు. వ్యయప్రయాలకోర్చి సాగుచేసిన పైరును బండరాళ్ల కింద శోధిస్తున్నాడు. తరిగోపుల బాబు కనగానపల్లి చెరువు కట్ట కింద నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. పంట వెన్నుదశలో ఉండేది. నెలరోజులు ఆగితే చేతికొచ్చేది. భారీ వర్షం అతడి ఆశలను అడియాసలు చేసింది. వాన బీభత్సానికి కనగానపల్లి చెరువు కట్ట సోమవారం రాత్రి తెగిపోయింది. బాబు సాగుచేసిన పంట మొత్తం కొట్టుకుపోయింది. అతడి భూమిలో చెరువు కట్టకు వాడిన భారీ రాళ్లు వచ్చి పడ్డాయి. పంట పెట్టుబడి పాయె.. పొలమూ పాయె అంటూ రైతు రోదిస్తున్నాడు. భూమిని మళ్లీ సాగులోకి తెచ్చుకోవడం అంత సులువు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

ఉరుములకు భయపడి ప్రైవేటు టీచర్ మృతి

తాడిమర్రి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకుంట్ల గ్రామానికి చెందిన ప్రైవేటు టీచర్ సాకే సూర్యనారాయణ సోమవారం రాత్రి ఉరుములకు భయపడి గుండెపోటుతో మరణించాడు. ఈయన బత్తలపల్లిలో నివాసముంటూ అక్కడే ప్రైవేటు పాఠశాలలో ట్యూషన్ టీచర్‌గా పనిచేస్తుండేవారు. ఆదివారం టెట్ రాసేందుకు కడపకు వెళ్తూ 5 నెలల గర్భిణి అయిన భార్య లక్ష్మీదేవిని, కుమార్తెలను స్వగ్రామం కునుకుంట్లకు పంపారు. పరీక్ష రాసి, తిరిగి కునుకుంట్లకు వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో బాత్‌రూంకు అని బయటకు వచ్చినపుడు భారీ శబ్దంతో ఉరుము వచ్చింది. దీంతో భయపడిపోయారు. ఇంట్లోకి వెళ్లి ఛాతీలో నొప్పిగా ఉందంటూ కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చెరువులపై నిఘా వేయండి : కలెక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో చెరువులపై నిఘా వేయాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురిశాయని, చెరువులు నిండుతున్నాయని అన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఇళ్లలోకి నీరు చేరిందని, వరద నీటిలో చిక్కుకున్న 110 కుటుంబాలను రెవెన్యూ, పోలీసు అధికారులు కాపాడారన్నారు. వారికి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 310 చెరువులు ఉన్నాయని, సగం చెరువులలో 50 శాతం నీరు ఉందని తెలిపారు. ప్రతి చెరువును వీఆర్ఓ, వీఆర్ఏ తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.92	1,611.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	52,001	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	51,309	9,900
సామర్థ్యం (టీఎంసీలు)	101.46	40.30

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా (జయంతి)



సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా 1491 అక్టోబరు 23న జన్మించారు. స్పానిష్ బాస్క్ క్యాథలిక్ మతగురువు, సొసైటీ ఆఫ్ జీసస్ సహసంస్థాపకులు. 1541లో ప్యారిస్‌లో ఆయన తొలి సుపీరియర్ జనరల్. ఆధ్యాత్మిక భావాలను, ధ్యానాలను, ప్రార్థనలు, మానసిక భావాలను సులభంగా ప్ర జలకు చేరువచేశారు. 1556 జూలై 31న రోమ్‌లో కన్నుమూశారు.

బైరాన్‌సింగ్ షెకావత్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత, దేశ 11వ ఉపరాష్ట్రపతి బైరాన్ సింగ్ షెకావత్ 1925 అక్టోబరు 23న రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించారు. తొలుత రాజస్థాన్ రాష్ట్రానికి వరుసగా 3సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఐదు దశాబ్దాలపాటు వివిధ నియోజకవర్గాలనుంచి ప్రాతినిధ్యం వహించారు. రాజస్థాన్ కా ఏక్ హి సింగ్, లేదా బబోసాగా పిలువబడ్డారు. ని రు పేదలకు చేయూతకోసం 'అంత్యోదయ' పథకానికి శ్రీకారం చుట్టారు. రాజస్థాన్‌లో విద్య, పరిశ్రమలతోపాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేశారు. 2010 మే 15న కన్నుమూశారు.

పుతిన (వర్ధంతి)



కన్నడ కవి, రచయిత 'పద్మశ్రీ' పురోహిత తిరునారాయణ నరసింహాచార్ (పుతిన) 1905 మార్చి 17న మండ్య జిల్లాలో జన్మించారు. కువెంపు, దరా బెంద్రే, పుతినలు కన్నడ సాహితీత్రయంగా పేరొందారు. సంగీతంతో కూడిన నాటకాలు రాశారు. కన్నడ భాషను ద్విగుణీకతం చేశారు. సాహిత్య అకాడమీ, పంపా అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 1998 అక్టోబరు 23న కన్నుమూశారు.

సునీల్ మిత్తల్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' సునీల్ భారతి మిత్తల్ 1957 అక్టోబరు 23న జన్మించారు. దేశ బిలియనీర్, మానవతావాది, ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. భారతి ఎంటర్‌ప్రైజెస్ సంస్థాపకులు, చైర్‌పర్సన్. 18వ ఏట వ్యాపారం మొదలుపెట్టాడు. టెలికామ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, మాల్స్, హాస్పిటాలిటీ, అగ్రి, ఆహార రంగాలలో రాణించారు. భారతి ఎయిర్‌టెల్ ప్రస్తుతం దేశంలో రెండోస్థానంలో నిలిచింది. దేశంలో శ్రీమంతులలో ఒకరిగా ఫోర్బ్స్ జాబితాలో పేర్కొన్నారు. లెక్కకు మిక్కిలి గౌరవాలు అందుకున్నారు.

ప్రభాస్ (పుట్టినరోజు)



అభిమానులచే 'డార్లింగ్'గా పిలవబడుతున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 1979 అక్టోబరు 23న జన్మించారు. పూర్తి పేరు ఉప్పలపాటి వెంకట సూర్యనారాయణ ప్రభాస్ రాజు. తెలుగు సినీ రంగంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. సినీ నిర్మాత ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు కుమారుడు. బాహుబలి సినిమాతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. నంది, సినీమా, సైమా అవార్డులు తదితర పురస్కారాలు అందుకున్నారు. మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో చోటు దక్కించుకున్న దక్షిణాది తొలి నటుడు.

భారీ వర్షంతో కుళ్లిన మిరప పంట

అన్నదాతలకు కోలుకోలేని దెబ్బ



భారీ వర్షంలో కుళ్లుతున్న మిరప పంట

బళ్లారిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మిర్చి పంట వేసుకున్న రైతన్నలకు ఇబ్బందులకు గురవుతున్నారు. తాలూకాలోని రూపనగుడి రాయపురం శ్రీరామ రంగాపురం, కొలగల్లు కృష్ణనగర్ క్యాంపు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రైతన్నలు మిర్చి పంట పైన ఆసక్తి చూపుతుంటారు. ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షంతో ఎకరాకు రూ. లక్షకు పైబడి ఖర్చులు పెట్టి మిరప పంట వేసుకోవడంతో గత నెల నుంచి కురుస్తున్న వర్షం సందర్భంగా పంటలు కుళ్లిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. శ్రీరామరంగాపురానికి చెందిన యువ రైతు కలమడప్ప మాట్లాడుతూ తనకున్న 18 ఎకరాల పొలంలో మి ర్చి పంటను వేశానని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా రావడంతో పంట కుళ్లిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి మిరప పంటపై తమ దృష్టిని ఉంచి పంట చేతికి వచ్చే సమయం దగ్గర పడటంతో అకాల వర్షాలు కురుస్తుండటంతో పంట చేతికి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతు నాగేంద్ర మాట్లాడుతూ భూమిని కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశానని ఇదే సంవత్సరమే అనుకోని విధంగా వర్షాలు ఎక్కువగా రావడంతో మిర్చి పంట చేతికొచ్చే సమయంలో రాలిపోతోందని తెలిపారు. చేతికొచ్చిన పంటను కూలీల ద్వారా కోసి మార్కెట్‌కు తరలిస్తున్నానని తెలిపారు.

కంప్లి-గంగావతి రాకపోకలు బంద్



వంతెనపై ఏర్పాటు చేసిన బారికేడ్లు

కంప్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జలాశయంలో నీటి ఇన్‌ఫ్లో అధికం కావడంతో జలాశయం నుంచి అధికారులు ఒక లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని నదికి విడుదల చేశారు. ఇలా ఈ యేడాది ఐదవ సారి ఇలా నీటిని విడుదల చేశారు. హంపి వద్ద కోదండరామ ఆలయంను తాకుతూ పురందేశ్వరి మంటపం పూర్తిగా నీట మునిగాయి. కేవలం గోపురం పైన వుండే పతాకం మాత్రమే కనిపిస్తోంది. అలాగే కంప్లి వద్ద చుట్టుపక్కల వుండే అరటి పొలాల్లోకి నీరు చేరాయి. కంప్లి కోట వద్ద నీరు వంతెనపై తాకుతూ ప్రవహిస్తున్నాయి. కొప్పళ, బళ్లారి జిల్లా అధికారులు అప్రమత్తమై రాకపోకలను బంద్ చేపట్టారు. అంతకుముందు నీరు జలాశయంకు ఎక్కువ మోతాదులో వస్తాయని తెలిసిన వెంటనే చిక్కజంతిగల్ నుంచి వచ్చే పాఠశాల విద్యార్థులు పరుగులు పెట్టారు. అధికారులు అప్పటికే రాకపోకలు బంద్ చేయడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్ర వాహనంపైన తీసుకెళ్లి తమ ఇంటికి చేర్చారు. అలాగే సన్నాపురం వద్ద నదికి అధిక మోతాదులో నీరు రావడంతో రైతులు తమ మోటార్లు ధ్వంసం కాకుండా అప్రమత్తమై నదిలో వేసుకున్న మోటార్లను తీసే ప్రయత్నంలో ఉన్నారు. నదికి ఇలా ఐదవ సారి నీరు పోటెత్తడంతో తమకు కొంతవరకు పంటలకు కూడా నష్టం వాటిల్లిందన్నారు. సక్రమంగా వేసుకున్న బోర్ల కింద పండిస్తున్న పంటలకు నదికి నీరు రావడంతో మోటార్లు ద్వారా పొలాలకు సక్రమంగా నీరందక వైరస్‌లు సోకి పూర్తిగా నష్టం వాటిల్లుతుందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకుని తమకు నష్టపరిహారం కల్పించాలని కోరారు. వంతెనపై ప్రతి సారీ నీరు రావడంతో విద్యార్థులు, రైతన్నలకు పూర్తిగా ఇబ్బందికరంగా మారింది. వంతెనను ఎత్తుగా నిర్మిస్తేనే ఈ కష్టాలు తప్పుతాయని ప్రజలు వాపోతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : వీసీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్ తదితరులు

బళ్లారి సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ మునిరాజు పేర్కొన్నారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్రీడా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు నేర్చుకుని శ్రద్ధగా ఆడాలని, దీంతోఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. క్రీడాకారులకు పోటీతత్వం ఉండాలన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. క్రీడలు, సంస్కృతిని ఆస్వాదించడంతోపాటు అనుభవం కూడా పొందాలన్నారు. ప్రొఫెసర్ రుద్రేశ్ మాట్లాడుతూ స్టేడియంలో ప్రత్యేక భవన నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని తెలిపారు. విశ్రాంత ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ మాట్లాడుతూ ప్రతి ఒక్క క్రీడాకారుడు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ప్రథమ ప్రాధాన్యమివ్వాలన్నారు. వేదికపై క్రీడా విభాగం డైరెక్టర్ శశిధర్ కోల్లూరు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్‌కుమార్ ఉన్నారు. యూనివర్సిటీ పరిధిలోని 15కళాశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్లు, ప్రొఫెసర్లు 150 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.

2,308 మంది నకిలీ కార్డులు రద్దు

నిర్మాణేతర కార్మికులపై కార్మిక శాఖ చర్యలు



పనిచేస్తున్న కార్మికులు

బళ్లారి సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో భవన నిర్మాణ కార్మికుల పేరుతో పొందిన 2,308 నకిలీ కార్డులను కార్మిక శాఖ అధికారులు రద్దు చేశారు. బోర్డు నుంచి కార్మికులు, వారి పిల్లలకు ఉన్న సౌకర్యాలను పొందేందుకు కార్మికులు కాని వారు కూడా నకిలీ పత్రాలు సమర్పించి కార్డులు పొందారు. దీంతో నిజమైన కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు ఇతరులకు అందుతున్నాయని భవన నిర్మాణ కార్మికల సంఘాలు గళం విప్పాయి. అలాంటి వారిని గుర్తించి కార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ కార్డుల దందాపై సంస్థలు చేస్తున్న ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ఆ శాఖ భవన నిర్మాణేతర కార్మికుల కార్డులను రద్దు చేసేందుకు గతేడాది నుంచి బోగస్ కార్డుల రద్దు ప్రచారాన్ని ప్రారంభించింది. బోర్డు దాదాపు 20 రకాల నిర్మాణ కార్మికుల ప్రయోజనాల కోసం, వారికి అనేక సౌకర్యాలను అందిస్తోంది. సర్జరీ రాయితీ, పిల్లల విద్యా ప్రోత్సాహకం, ల్యాప్‌టాప్‌ల పంపిణీ, వివాహ కార్యక్రమాలలో సహాయం, పని చేస్తున్నప్పుడు ప్రమాదంలో గాయపడినా లేదా మరణిస్తే నష్టపరిహారంతో సహా వారి జీవితానికి సామాజిక భద్రతను అందించే సౌకర్యాలను బోర్డు అందిస్తుంది. ఎవరైనా తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేస్తే డేటా నుంచి గుర్తించి దరఖాస్తును బ్లాక్ చేస్తామని జిల్లాలేబర్ అధికారి సిద్దప్ప తెలిపారు. కార్మికులు ప్రతి సంవత్సరం తమ కార్డును రెన్యువల్ చేసుకోవాలని, ఏడాదిలో కనీసం 90రోజుల భవన నిర్మాణ పనులు చేయాలని, భవన యజమాని నుంచి జీతం తీసుకున్నట్లు పత్రం సమర్పించాలని తెలిపారు. అలాంటి వారికే కార్డ్ రెన్యువల్ చేస్తామని, లేకపోతే రద్దు చేస్తామని పేర్కొన్నారు.

ఇచ్చిన మాట కోసం శ్రీరాములును ఎమ్మెల్యే చేశా : గాలి



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

బళ్లారి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి శ్రీరాములు నాన్నకు మాట ఇచ్చాను. శ్రీరాములను ఎమ్మెల్యేగా చేస్తానని ఆరోజు ఇచ్చిన మాట నిలుపుకున్నాను అని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హవ్వంబావిలోని గాలి జనార్దన్‌రెడ్డి కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సండూరు ఎన్నికల్లో దివాకర్‌కు టికెట్ వస్తుందని ఆశించాం. కానీ బీజేపీ అధిష్టాన వర్గం టికెట్ ఇవ్వలేదు. ఇదొక మంచికేనేమో అని అన్నారు. ఎందుకంటే రాబోయే రోజుల్లో దివాకర్ మంత్రి కూడా కావచ్చు అని జోస్యం చెప్పారు. బహుబలి సినిమా కథను వివరిస్తూ ప్రజలు నన్ను ఎప్పుడూ మెచ్చుకుంటారని చెప్పారు. సండూరు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. అటల్‌బిహార్ వాజ్‌పే, యడ్యూరప్ప, ఇతర పెద్ద పెద్ద నాయకులు పదవులు రావడానికి చాలా కష్టపడ్డారని తెలిపారు. నాకు కూడా ఇంకా వయస్సు ఉంది. ఇంకా పదేళ్ల వరకూ నేను గట్టిగానే ఉంటాను అన్నారు. నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని చెప్పారు. సండూరు ఉప ఎన్నికలు ఖచ్చితంగా విజయం సాధిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కార్యర్తలు పాల్గొన్నరు.

వంతెనపై ట్రాక్టర్ పల్టీ

తోరణగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా తోరణగల్లు గ్రామం జిందాల్ సంస్థ ఎస్‌ఎంటీ గేట్ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వెనుక వున్న హళ్లి వంతెనపై గత రెండు రోజులుగా విట్లాపురం, అంతపురం మొదలగు ప్రాంతాలలో కురిసిన వర్షాలతో వంతెనపై నీరు పారుతున్నది. వంతెన అవతల ఇళ్లలో ఉన్న నివసిస్తున్న కొంతమంది కార్మికులు ఎక్కి వంతెన దాటుతుండగా నీటితో పారుతున్న వంతెనపై ట్రాక్టర్ పల్టీ ప్రమాదం నుండి బయటపడ్డ కార్మికులు, పోలీసు అధికారులు, యువకులు సహాయం చండూరు తాలుకా తోరణగల్లు గ్రామం సమీపంలోని జిందాల్ టెన్‌ఎంటి గేట్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక కణిగినహళ్లి వంతెనపై రెండు రోజుల నుంచి విట్లాపురం, అంతపురం ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో వంతెనపై నీరు పారుతున్నది. వంతెన అవతల ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కార్మికులు రోజు మాదిరిగానే ట్రాక్టర్ ఎక్కి వంతెన దాటుతుండగా చక్రాలు స్లిప్ అయ్యి ట్రాక్టర్ నిదానందా పల్టీ కొట్టింది. అందులో ఉన్న కార్మికులు నీళ్లల్లో దూకి ప్రాణాలు రక్షించుకోవడం జరిగిందని తెలుస్తుంది. పోలీసు అధికారులు అక్కడి యువకులతో కలిసి తక్షణం సహాయ సహకారాలు అందించారు.

నిధుల వినియోగంలో తుకారామ్ విఫలం

కంప్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : బళ్లారి జిల్లాలోని సండూరు క్షేత్రంలో బీఎంఎఫ్, కేఎంఈ, కేఎంఆర్‌సీ, సీఎస్ఆర్ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవడంలో సండూరు ఎమ్మెల్యే, బళ్లారి ఎంపీ తుకారామ్ విఫలమయ్యారని ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సండూరు నియోజకవర్గంలోని బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ఏఖబెంచి గ్రామంలో బంగారు హనుమంతప్ప గెలుపు కోసం జోరుగా ప్రచారం చేపట్టారు. తుకారామ్ నాలుగుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ, రెండు సార్లు మంత్రి అయ్యిండి కూడా ఇప్పటికీ సండూరు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా వుందన్నారు. ఈ ప్రచార విషయంలో సండూరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటన చేపట్టాము. పలు చోట్ల మౌళిక సదుపాయాలు, సీసీ రోడ్లు, తాగే నీరు లేక ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అయిన బంగారు హనుమంతుకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించినట్లయితే దేశంలో నరేంద్రమోడీ ఎలా అభివృద్ధిపై దృష్టి సారించారో అలాగే క్షేత్రంలో కూడా అలాగే దృష్టిసారించి జిల్లాలోనే మాదిరి క్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అంతకుముందు జనార్దన్‌రెడ్డికు అంబన్న, శంకర్‌దాసు, హేమచంద్రలు అభినందించి గొర్రెపిల్లను అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, జీటీ పంపాపతి, ఐఎల్ఈ తిమ్మప్ప, నానాసాబ్ నిక్కమ్, మల్లమ్మ, గురుమూర్తి, పూజారి చిదానంద, ఈరణ్ణ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయాలని న్యాయవాదుల ధర్నా

సిరుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రహదారి మరమ్మతులు చేపట్టాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఉప్పర వెంకోబ ప్రభుత్వాన్ని కోరారు. వారం రోజుల క్రితం ఆంధ్రజ్యోతి పత్రికలో 'రహదారి మరమ్మతులు ఎప్పుడు' అని శీర్షిక ప్రచురించింది. ఈ ప్రకటనతో న్యాయవాదులు రహదారి మరమ్మతుల కోసం పోరాటం కొనసాగించారు. రహదారిలో ర్యాలీ నిర్వహించారు. రాస్తారోకో చేపట్టారు. ధర్నా చేశారు. అనంతరం జెడ్పీ తహసీల్దార్ సత్యమ్మకు వినతిపత్రం అందజేశారు. రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రజలు ప్రాణాలను గుప్పెట పట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మొత్తం గుంతలు పడి, తారు రోడ్డు మొత్తం ఎగిరి పోయి మట్టి రోడ్డుగా మిగిలిందన్నారు. రెండేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు.

రాజ్యోత్సవాన్ని సంబరంగా నిర్వహించుకోవాలి

రాయచూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది నవెంబర్ 1న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాజ్యోత్సవ క్యాక్రమాన్ని వైభవంగా అర్థవంతంగా నిర్వహించుకునేందుకు అన్ని శాఖలు నిబద్ధతతో పని చేయాలని అదనపు జిల్లాధికారి శివానంద సూచించారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించి మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో రాజ్యోత్సవ పూర్వసిద్ధత సమావేశం నిర్వహించారు. వివిధ వాకల అధికారులు, పలు కన్నడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో రాజ్యోత్సవం నాడు పాల్గొనే ఊరేగింపులో అన్ని సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కన్నడ భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రతియొక్కరు తగిన శ్రద్ధ తీసుకోవాలని నిర్ణయించారు. అదే సమయంలో కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యోత్సవ కార్యక్రమాలను కేవలం నామమాత్రంగా కాకుండా మరింత సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా రాజ్యోత్సవ సందర్భంగా కన్నడ ధ్వజారోహణ ఊరేగింపు తదితర కార్యక్రమాలను పకడ్బందీగా ప్రణాళికబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. ఊరేగింపులో వివిధ కళాబృందాలు పాల్గొనేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని అదనపు జిల్లాధికారి సూచించారు.

'గౌరీ లంకేశ్ హంతకులకు సన్మానం సిగ్గుచేటు'

రాయచూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పత్రిక సంపాదకురాలు గౌరి లంకేశ్‌ను హత్య చేసిన వారిని అమరుల సంస్మరణం దినం పేరున సన్మానించడం సిగ్గుచేటని గౌరి లంకేశ్ ట్రస్ట్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. హోం శాఖ చేసిన ఈ నిర్వాకాన్ని నిరశిస్తు మంగళవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద ట్రస్ట్ సభ్యులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు ప్రజా స్వామికవాదులు, పౌరహక్కుల సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, గౌరి లంకేశ్‌ను పట్టపగులు హత్య చేసిన వారిని సన్మానించడం అంటే హంతకులకు సమాజం మద్దతుగా నిలువడమేనన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తన చర్యను ఏ మాత్రం సమర్థించుకోజాలదని ఇందుకు సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలను, ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

దీపావళికి ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ బంపర్ ఆఫర్లు

బళ్లారి సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆధునిక కాలానికి తగ్గట్టుగా అధునాతన పరిజ్ఞానంతో కూడిన గృహోపయోగ వస్తువుల అమ్మకాలలో దూసుకెళుతూ, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందిస్తున్న ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ దీపావళి పండుగను పురస్కరించుకుని బంపర్ ఆఫర్లు, బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు రవికాంత్, శ్రీకాంత్ తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా మార్కెట్‌లో ఆర్‌కే ఎలక్ట్రానిక్స్ అంటే మంచి పేరు సంపాదించామని, ప్రస్తుతం పోటీని ఎదుర్కొని వ్యాపారం చేస్తున్నామంటే బళ్లారి జిల్లా ప్రజలకు తమ పట్ల ఉన్న నమ్మకమే ఈ స్థాయికి తీసుకొచ్చిందని వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో పాటు వారి అభిరుచులకు తగ్గట్టుగా మార్కెట్‌లో ఉన్న బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఎలక్ట్రానిక్స్ వస్తువులు, గృహోపయోగ వస్తువులన్నీ ఆర్‌కే ఎలాక్ట్రానిక్స్‌లో లభిస్తాయన్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా కొనుగోలుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సులభ వాయిదా పద్ధతిలో సున్నా శాతం వడ్డీతో వస్తువులు కొనుగోలు చేసేందుకు బజాజ్, హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుణసౌకర్యంతో పాటు కొనగోళ్లపై బంపర్ ఆఫర్లు, బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. బహుమతులుగా కార్లు, మిక్సీలు, కుక్కర్లు అందిస్తున్నట్లు వివరించారు. నిబంధనలకు లోబడి ప్రతి కొనుగోలుపై 20శాతం క్యాష్‌బ్యాక్‌ను వినియోదారులకు అందిస్తున్నామని తెలిపారు.

హోసూరు జోన్

ముఖ్యమంత్రి కప్ విజేతలకు అభినందన



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

హోసూరు(కృష్ణగిరి) అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కప్ బాక్సింగ్ పోటీల్లో రాణించిన విజేతలను కలెక్టర్ కార్యాలయంలో మంళవారం ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు కలెక్టర్ సరయు ప్రశంసా పత్రాలు,ట్రోఫీలు అందచేశారు. ఈనెల 10 నుంచి 17వరకు చెన్నైలోని జవహర్‌లాల్‌నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్, రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో వివిధ పాఠశాల,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. బాక్సింగ్‌లో ఎం. తిరువేందన్ అనే విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించగా, పాఠశాల స్థాయి పోటీల్లో విజయ్ ది మిలీనియం పాఠశాల తరఫున ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. అప్పపల్లికి చెందిన చెలమిక అనే విద్యార్థిని రజత పతకం, వీఎస్ అక్షయశ్రీ అనే విద్యార్థిని కాంస్య పతకం, ఏపీ గౌతు అనే విద్యార్థి కాంస్య పతకం సాధించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంల్లో జిల్లా క్రీడా అధికారి రాజగోపాల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వాహనాలపై కుప్పకూలిన చెట్టు

హెబ్బాళ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆర్‌టినగర్‌లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో అకస్మాత్తుగా ఒక చెట్టు కుప్పకూలింది. ఈ కారణంగా ఐదు ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలకు నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం కలగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా చెట్టు కూలిన ప్రమాదంలో విద్యుత్ స్తంభం కూడా దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. బీబీఎంపీ, బెస్కాం ఇతర సిబ్బంది కార్యాచరణలో పాల్గొని పునరుద్ధరణ చేస్తున్నారు.

వర్షాలతో తోటల్లోనే పూలు .. పడిపోయిన ధరలు





తోటలో విరగ్గాసిన బంతిపూలు, రోడ్డు పక్కన వదిలేసిన పూలు

హోసూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న పూలను కోయలేని పరిస్థితి నెలకొంది. హోసూరు ప్రాంతం పూలసాగుకు పేరొందిన విషయం విదితమే. ప్రస్తుత సీజన్‌లో చామంతి, బంతిపూలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వర్షాలతో మార్కెట్‌కు పూలు రావడం లేదు. డిమాండ్‌కు బదులు పూలధర కూడా తగ్గుముఖం పట్టింది. హోసూరు, బాగలూరు, బేరికై, కెలమంగలం, ఉద్దన్నపల్లి, డెంకణీకోట, తళి, శూలగిరి, రాయకోట ప్రాంతాల్లో రైతులు పూలను తోటల్లోనే వదిలేశారు. ప్రస్తుతం బంతి పూలు 5 వేల హెక్టార్లలో సాగు అవుతోంది. నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో తమిళనాడులోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక, కేరళ, సహ రాష్ట్రాలకు పూలు ఎగుమతి సాధ్యం కాలేదు. మరోవైపు పూలు కోయడానికి కూడా కూలీలు రాకపోవడంతో తోటలోనే వదిలేయాల్సిన పరిస్థితి. దసరా తర్వాత బంతిపూల ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం కిలో బంతి పూలు రూ.15 పలుకుతోంది. దీంతో కూలీ అందడం లేదని అందుకే తోటల్లోనే వదిలేస్తున్నామని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

ఈ రోడ్డు మీద నడిచేదెలా..?



బురదమయంగా ఉన్న రహదారి

హోసూరు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంన బేగేపల్లి పంచాయతీ రాజేశ్వరీ లే అవుట్‌లో అధ్వానస్థితిలో ఉన్న రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 8 సంవత్సరాలుగా రోడ్డును పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిల్లోని బేగేపల్లి పంచాయతీ పరిధిల్లోని రాజేశ్వరీ లే అవుట్‌లో 5 వేలకు ప్రజలు ఉన్నారు. ఈ ప్రాంతంల్లో వివిధ తరహాల చిన్న పరిశ్రమలు కూడా ఉన్నాయి. చాలా మంది ఇతర రాష్ట్రాల కార్మికులు ఇక్కడ ఉంటూ పనిచేస్తున్నారు. గుంతలమయమైన మట్టిరోడ్డును పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.